క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ జాతర



జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న బెస్తలు

కంబదూరు: మండల కేంద్రంలో గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. స్థానిక బెస్తకులస్తులు ఉదయమే జ్యోతులు, బోనాలను చేతపట్టుకొని భీష్మునుడు,గంగమ్మ తల్లి చిత్రపటాలను గ్రామ ప్రధాన వీధుల ఉండా ఊరేగించారు. తర్వాత చెరువుకట్ట వద్ద ఉన్న గంగమ్మ ఆలయంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు అవగాహన

కంబదూరు: ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసే విధానంపై రైతులకు జిల్లా వ్యవసాయాధికారులు సోమవారం అవగాహన కల్పించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారి జాఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అనంతపురం రైతు శిక్షణ కేంద్రం నుంచి డీడీ మద్దిలేటి, ఏడీఏ శైలజాకుమారి, ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పలు రకాల పంటలను సాగు చేసే ముందు విత్తన శుద్ధి,పంట మార్పిడి, ఎరువుల వాడకం, చీడపీడల నివారణ, కలుపు మొక్కల తొలగింపు, సమష్టి వ్యవసాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం పరిశీలన

కుందుర్పి: మండల వ్యాప్తంగా కుసుమ గిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సీఎస్‌సీ ఆధ్వర్యంలో బీడు భూముల్లో లక్ష మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం మొక్కల నాటే కార్యక్రమాన్ని కంపెనీ ప్రతినిధులు నవీన్ కుమార్, డైరెక్టర్ లక్ష్మీపతి, నరసింహమూర్తి తదితరులు పరిశీలించారు.

అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉరవకొండ: వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కేజే నారాయణతోపాటు మరికొందరు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధిహామీ పనులను కూలీలతో చేయించకుండా టెక్నికల్ అసిస్టెంట్ హరికృష్ణ, ఉపాధి ఇంజనీర్ ప్రభాకర్ మేట్ల ద్వారా జేసీబీలతో చేయిస్తున్నారన్నారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు గ్రామంలో ఉపాధిహామీ కింద చేసిన పనులపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకులతో సమీక్ష

కళ్యాణదుర్గం: నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త డాక్టర్ తలారి రంగయ్య వైఎస్సార్‌సీపీ నాయకులతో మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు పార్టీ కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. పార్టీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో కుందుర్పి మండల నాయకులు, కార్యకర్తలతో ఉదయం 10 గంటలకు సమీక్ష నిర్వహించనున్నారు. మండల కన్వీనర్, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సింగిల్ విండో అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని కార్యాలయం పేర్కొంది.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుమ్మఘట్ట: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంఈఓ రామచంద్ర ఆధ్వర్యంలో నేను బడికి పోతా అనే కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గుండె పోటుతో వార్డుమెంబర్ మృతి

కూడేరు: మండల పరిధిలోని జల్లిపల్లికి చెందిన ఏడో వార్డు మెంబర్ , వైఎస్సార్ సీపీ నేత సహదేవ (60) సోమవారం బెంగళూరులో గుండె పోటుతో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను జల్లిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు. సహదేవ మరణం పార్టీకి తీరని లోటు అని నేతలు అన్నారు.

విజృంభిస్తున్న డయేరియా

- ఉరవకొండలో నాలుగు రోజుల్లోనే 54 కేసుల నమోదు
- సోమవారం ఒక్క రోజే 10 కేసుల నమోదు



ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో డయేరియాతో చికిత్స పొందుతున్న బాధితులు

ఉరవకొండ: మండలంలో వారం రోజులుగా డయేరియా విజృంభిస్తోంది. ఉరవకొండలో నాలుగు రోజుల్లోనే 54 కేసులు నమోదయ్యాయి. వీరు పట్టణంతోపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అత్యధికంగా ఉరవకొండలోనే అత్యధికంగా 28 మంది వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఒక్క రోజే ఒకే కుటుంబానికి చెందిన 10 మంది వాంతులు, విరేచనాలతో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో చేరారు. మెరుగైన చికిత్స అందిస్తున్నామని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ ఎల్లోజి తెలిపారు.

ఉరవకొండలో కలుషిత నీరు సరఫరా : ఉరవకొండలో స్వచ్ఛమైన తాగునీరు సక్రమంగా అందకపోవడంతో కొళాయిల్లో వస్తున్న కలుషిత నీటిని తాగాల్సి వస్తోంది. దీంతో అధిక సంఖ్యలో ప్రజలు డయేరియా బారిన పడుతున్నారు. నెలరోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో శుద్ధి చేయకపోయినా మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్న నీటినే బిందె రూ.10 వెచ్చించి ప్రజలు తాగాల్సి వస్తోంది.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



గోనేహాళ్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండయ్య

బొమ్మనహాళ్: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటే గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలవని పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతాభార్గవి, కుమారరాజ అన్నారు. సోమవారం మండలంలోని గోనేహాళ్ గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, గౌతమి, ఈశ్వరమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వాధ్యులపై అవగాహన కల్పించండి

విడపనకల్లు: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, జాగ్రత్తలు తెలియజేయాలని ఎంపీడీఓ కొండయ్య అధికారులను సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సీజనల్ వ్యాధులు- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్యబాబు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకర్ నాయక్, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ధనుంజయ పాల్గొన్నారు.

భూసమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు



కూడేరులో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై వీఆర్వోతో మాట్లాడుతున్న తహసీల్దార్ రత్న రాధిక

కూడేరు: భూ, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా పరిష్కరించాలని వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. సోమవారం కూడేరులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు అందించారు. భూమస్యలపై వచ్చిన అర్జీలపై ఆయా వీఆర్వోలను పిలిచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ విశ్వనాథ్, హౌసింగ్ ఏఈ శేఖర్, ఎంఈఓ చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి, సీఎస్‌డీటీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

34 వినతులు

కంబదూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 34 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ నిత్యానందబాబు తెలిపారు. ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో సంబంధిత అధికారులకు విన్నవించుకున్నారన్నారు. ఎక్కువగా వెబ్ ల్యాండ్ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు వచ్చాయన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీనీ పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఐదు వినతులు అందినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. భూ వివాదంపై రెండు, భూ సర్వేకు సంబంధించి మూడు వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరిదేవి, ఏఓ నిర్మల్‌కుమార్, వెటర్నరీ వైద్యులు నవీన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత, ఈఓఆర్డీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటిలోపు పాఠశాలలో చేరాలి

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష రాసిన అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 25లోపు చేరాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఒక వేళ విద్యార్థులు చేరకపోయినట్లయితే, తర్వాత మెరిట్ లిస్టులో ఉన్న విద్యార్థులకు ఆ సీట్లను కేటాయించనున్నట్లు తెలిపారు.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినులు ఈనెల 25 లోపు చేరాలని ప్రిన్సిపాల్ సత్యవతమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు చేరని పక్షంలో ఆ తర్వాత మెరిట్ లిస్టులో ఉన్న విద్యార్థినులకు సీటు కేటాయించనున్నట్లు తెలిపారు.

బ్యాంకు ఏర్పాటు చేయాలని వినతి

కుందుర్పి: మండల కేంద్రమైన కుందుర్పిలో మరో బ్యాంకును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు ప్రజలు, ఉపాధ్యాయులు సోమవారం వినతిపత్రం అందించారు. కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను తెలియజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

రక్షిత నీటిని తాగాలి



లక్ష్మంపల్లిలో నీటి నాణ్యతను పరిశీలిస్తున్న డాక్టర్ తరుణసాయి

శెట్టూరు: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని డాక్టర్ తరుణసాయి తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మంపల్లిలో, చిన్నంపల్లి, ములకలేడు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్లలో వైద్య సిబ్బంది పర్యటించారు. లక్ష్మంపల్లి పాఠశాలలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లోని నీటి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు డయేరియా, మలేరియా, డెంగీ, చేతులు శుభ్రతపై డాక్టర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లీలావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వైభవంగా ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు



సద్గురు ఎర్రితాతస్వామి ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు



శాంతిధామంలో శేషతల్ప అలంకరణలో ఎర్రితాతస్వామి

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని శాంతిధామంలో సద్గురు ఎర్రితాతస్వామి 88వ ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం స్వామికి ఉదయం నుంచి సహస్ర మూలికా పంచామృతాభిషేకాలు, రుద్ర, గణపతి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా స్వామి శేషతల్ప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామి ప్రభోత్సవాన్ని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ప్రత్యేక పూజలతో స్వామి ప్రభోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రభోత్సవాన్ని మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాలు, చెక్క భజనలతో పురవీధుల గుండా శాంతిధామం వరకు నిర్వహించారు. ఎస్ఐ శివ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉట్లపరుష , ఆలయంలో ప్రత్యేక భజనలు, కోలాటాలు ఉంటాయి.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



పార్వతీ పరమేశ్వరులు

అనంతపురం కల్చరల్: స్థానిక అరవింద నగర్‌లోని సర్వేశ్వరాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. రెండు రోజుల పాటు సాగిన ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఉదయం పార్వతీ పరమేశ్వరులకు రుత్వికులు భక్తిశ్రద్ధలతో కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గురుమూర్తి స్వామి నేతృత్వంలో కల్యాణంలోని అన్ని ఘట్టాలను సంప్రదాయ సిద్ధంగా సాగాయి. గవిమఠం పీఠాధిపతి కరిబసవ రాజేంద్ర మహాస్వామీజీ విశిష్ట అతిథిగా విచ్చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. స్వయంగా శివపార్వతుల కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆయన భక్తిమార్గంపై మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతత ఇస్తుందన్నారు. అందరూ భక్తిమార్గంలో నడవాలని సూచించారు. సాయంత్రం నగర వీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు నయనానందకరంగా సాగింది. శివనామస్మరణతో వీధులు మార్మోగాయి. జంగమయ్యల శివకళారూపాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా వివిధ దేవతామూర్తుల వేషధారణల్లో దీపం పట్టుకున్న అమ్మవారిగా కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాద వినియోగం జరిగాయి.

30 వరకూ పంట రుణాల రెన్యూవల్స్

కళ్యాణదుర్గం: ఈనెల 30 వరకు చాపిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో పంట రుణాల రెన్యూవల్స్ చేయనున్నట్లు సంఘం సీఈఓ టి.నారాయణస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రుణాలు పొంది ఉండి, రూ.300 సభ్యత్వం, ఓటు హక్కు ఉన్న సభ్యులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నామినీతో సహా, ఫోన్ నంబర్, లేదా పాన్ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలు, 3 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు కార్యాలయంలో అందజేయాలన్నారు.

పాఠ్య పుస్తకాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి



పాఠ్యపుస్తకాలను చూపిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాల విక్రయాలపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని ఏవీఆర్ పాఠశాలలో భారీ స్థాయిలో పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు వెళ్లి అక్కడ ఓ గదిలో ఉంచిన పాఠ్య పుస్తకాలను బయటకు పడేశారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై జిల్లా కలెక్టర్ స్పందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అంజి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు.

సమష్టి కృషితో అతిసార వ్యాధికి అడ్డుకట్ట



సమావేశంలో పాల్గొన్న అధికారులు



కూడేరు: మాట్లాడుతున్న వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి

కూడేరు: సమష్టి కృషితో అతిసారకు అడ్డుకట్ట వేయొచ్చని మండల వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి తెలిపారు. సోమవారం కూడేరు ఎంపీడీఓ కార్యాలయంలో అతిసార నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు తాగునీటి ట్యాంక్‌లను నెలకు రెండు సార్లు శుభ్రం చేయించాలని, వీధుల్లో పరిశుభ్రతను నెలకొల్పాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించి, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీ, విద్యాధికారులు పిల్లలకు భోజనానికి ముందు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏఓ విజయ కుమార్, ఏపీఓ తులసీ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి, హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డయేరియాపై సమావేశం

గుమ్మఘట్ట: డయేరియాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ గౌరిదేవి, పీహెచ్‌సీ డాక్టర్ మురళీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ఇంటింటా సర్వే ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఓ నిర్మల్‌కుమార్, పశువైద్యులు నవీన్‌కుమార్, ఉపాధి ఏపీఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్లో దోమల మందు పిచికారీ

విడపనకల్లు: మండలంలోని కస్తూరిబా, బీసీ బాలికల హాస్టల్లో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో దోమలమందును సోమవారం పిచికారీ చేయించారు. హాస్టల్లో విద్యార్థులు ఉంటున్న గదులు, పరిసరాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం, కాంగ్రెస్ నాయకులు



తహసీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందించాలని సీపీఎం, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు మధుసూదన్‌నాయుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సోనియాశీనా, ఇంద్రావతి ఓబుళేసులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మునీంద్రకు నాయకులు వినతిపత్రం అందించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించండి

కళ్యాణదుర్గం రూరల్: టీడీపీ ఎన్నికల హామీలో ప్రకటించిన విధంగా ప్రతి రైతుకూ రూ.20వేల పెట్టుబడి సాయం అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమలో సీపీఎం మండల కార్యదర్శి రంగనాథ్, పట్టణ కార్యదర్శి రఘు, మంజు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లోకి జమ చేయాలి

రాయదుర్గం రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ఎన్నికల సమయంలో ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయాలని రాయదుర్గం మండలం రైతు సంఘం కమిటీ సభ్యులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతు సంఘం నాయకుడు జయరాం నాయక్, సీపీఎం నాయకులు నాగరాజు, రమేష్ తదితరులు తహసీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రం అందించారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



నెట్టి కల్లప్ప (ఫైల్)

కంబదూరు: మండలంలోని చెర్లోపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నెట్టి కల్లప్ప (48) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. నెట్టికల్లప్పకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఎనలేని అభిమానం. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొందుతుందని, జగనన్న సీఎం అవుతారని రూ.50వేలు పందెం వేశాడు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకపోవడంతో డబ్బులు పోయాయి. అప్పటి నుంచి మదనపడుతుండేవాడు. అనారోగ్యానికి గురై అనంతపురంలోని ఆస్పత్రికి చికిత్స చేయించినా ఫలితంలేకపోయింది. ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలు గోవిందు, శ్రావణి ఉన్నారు. కల్లప్ప మృతదేహానికి సేవాదళ్ జిల్లా సహాయ కార్యదర్శి వడ్డే వెంకటప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు.

శ్రీసాయి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కమలా నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో 'ఫస్ట్ స్టెప్ స్కిల్స్' సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. జస్టిక్ కన్‌స్ట్రక్షన్స్, స్కిల్ డిజైర్, హీరో మోటార్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆరుగురు విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల చైర్మన్ ఎస్‌హెచ్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.దామోదర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.షెక్షావలి, పవన్ కుమార్, వెంకటేశ్వర్లు, వెంకన్న, చలపతి పాల్గొన్నారు.

మందుల వివరాలు తెలపాలి

గార్లదిన్నె: మండలంలో ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువుల ధరల పట్టిక, ఎరువులు, మందులు వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని రాయలసీమ రైతు సంఘం నాయకులు అక్బర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపులో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే రైతులకు నాణ్యమైన ఎరువులు , మందులు విక్రయించాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన వారికి బిల్లులు అందజేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఓ సోమశేఖర్‌కు అందజేశారు. ఆ సంఘం నాయకుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



కొకుంట్ల సిద్ధారెడ్డి (ఫైల్)

ఉరవకొండ: మండలంలోని పెద్దకౌకుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిద్ధారెడ్డి (75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కమ్యూనిస్టు యోధుడు రాకెట్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నో భూపోరాటాలు చేసిన చరిత్ర సిద్ధారెడ్డికి ఉంది. సిద్ధారెడ్డి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు రాకెట్ల అశోక్, తేజోనాథ్, వసంతమ్మ తదితరులు సిద్ధారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

జీవో 117 రద్దు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: జీవో నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేశులు కోరారు.